

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రిటర్నింగ్ ఆఫీసర్ దాసరి హరిచందన

నమస్తే తెలంగాణ

# నల్లగొండ

3 | నల్లగొండ, శుక్రవారం 7 జూన్ 2024 | NALGONDA

## డిప్లొమో కోర్సుల్లో అడ్మిషన్లకు దరఖాస్తులు

త్రిపురారం, జూన్ 6 : ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అగ్రికల్చర్, పాలిటెక్నిక్ కళాశాలల్లో చేరడానికి నోటిఫికేషన్ విడుదల అయ్యిందని కంపసాగర్ పాలిటెక్నిక్ కళాశాల, వ్యవసాయ పరిశోధన స్థానం అధిపతి డాక్టర్ ఎన్.లింగయ్య తెలిపారు. రాష్ట్రంలోని మొత్తం కళాశాలల్లో 240 సీట్లు ఉన్నాయని, వాటితోపాటు డిప్లమో ఇన్ అగ్రికల్చర్ ఇంజినీరింగ్‌లో మూడు సంవత్సరాల కోర్సు చేయడానికి 20 సీట్లు, అనుబంధ యూనివర్సిటీల్లో 90సీట్లు ఉన్నాయని పేర్కొన్నారు. రెండేండ్ల పాటు నిర్వహించే డిప్లొమో ఇన్ ఆర్గానిక్ అగ్రికల్చర్ కోర్సులో 60 సీట్లు ఉన్నాయని తెలిపారు. ఈ సంవత్సరం పదో తరగతిలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులతోపాటు ఓపెన్ స్కూల్‌లో పాసైన వారు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. పదో తరగతిలో 35శాతం మార్కులు వచ్చి ఉండాలని, 2024 డిసెంబర్ 31నాటికి 15 సంవత్సరాలు నిండి ఉండాలని, 25 సంవత్సరాల్లోపు ఉన్నవారు మాత్రమే దీనికి అర్హులని తెలిపారు. జనరల్ అభ్యర్థులు రూ.1200, దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీలు రూ.600 చెల్లించి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. రిజిస్ట్రేషన్‌కు ఈ నెల 25వరకు అవకాశం ఉన్నదని, ఇతర వివరాలకు 994930181లో సంప్రదించాలని సూచించారు.

## పారదర్శకంగా కౌంటింగ్ ప్రక్రియ

- రాత్రి 9గంటలకు మొదటి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు పూర్తి
- నాలుగు రౌండ్లు పూర్తయ్యేసరికి చెల్లిన ఓట్లు 3,10,189
- రెండో ప్రాధాన్యత ఓట్ల లెక్కింపునకు సిద్ధం
- రిటర్నింగ్ ఆఫీసర్ దాసరి హరిచందన

నల్లగొండ రూరల్, జూన్ 6 : వరంగల్ – ఖమ్మం – నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ అంతా పారదర్శకంగా, నిష్పక్షపాతంగా జరుగుతున్నదని రిటర్నింగ్ అధికారి దాసరి హరిచందన అన్నారు. ఏజెంట్లు సంతకాలు చేసిన తరువాతే ఫలితాలు ప్రకటిస్తున్నామని చెప్పారు. నల్లగొండ జిల్లా అనిశెట్టి దుప్పలపల్లి వద్ద ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రంలో గురువారం రాత్రి విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. రాత్రి 9గంటల వరకు మొదటి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు పూర్తయిందన్నారు. మొత్తం 3,36,013 ఓట్లు పోలవగా.. అందులో 3,10,189 ఓట్లు చెల్లుబాటయ్యాయని, గెలుపు కోటా 1,55,095 ఓట్లు అని తెలిపారు. మొదటి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపులో తీన్మార్ మల్లన్నకు 1,22,813, రాకేశ్‌రెడ్డికి 1,04,248, ప్రేమేందర్ రెడ్డికి 43,313, పాలకూరి అశోక్‌కుమార్ గౌడ్‌కు 29,697 ఓట్లు వచ్చాయన్నారు. గెలుపునకు కావాల్సిన 1,55,095 ఓట్లు మొదటి ప్రాధాన్యతలో ఎవరికీ రాకపోవడంతో రెండో ప్రాధాన్యత ఓట్లు లెక్కించనున్నట్లు తెలిపారు. 52 మంది అభ్యర్థుల్లో అతి తక్కువ ఓట్లు వచ్చిన అభ్యర్థి నుంచి ఎలిమినేషన్ ప్రారంభిస్తామన్నారు. చెల్లని ఓట్లు అధికంగా ఉండడం వల్ల కౌంటింగ్ ప్రక్రియ ఆలస్యమవుతుందని చెప్పారు. కౌంటింగ్ ప్రక్రియ మొత్తం సీసీ టీవీల్లో రికార్డు అవుతుందన్నారు.


## నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్లపై కేసు నమోదు

నీలగిరి, జూన్ 6 : వరంగల్ – ఖమ్మం – నల్లగొండ పట్టభద్రుల శాసనమండలి ఉప ఎన్నికల ఓట్ల లెక్కింపు సందర్భంగా మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డిపై తిప్పర్తి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. బుధవారం రాత్రి 9గంటల సమయంలో కౌంటింగ్ హాల్–2లో ఎన్నికల విధులు నిర్వర్తిస్తున్న ఏఆర్‌ఓ వెంకటేశ్వర్లు వద్దకు వచ్చి బ్యాలెట్ పేపర్లు చూపించాలని భూపాల్‌రెడ్డి అడిగారు. మీరు ఎవరు, గుర్తింపు కార్డు చూపించాలని ఏఆర్‌ఓ అడుగగా..

స్వతంత్ర అభ్యర్థికి చెందినది, అది కూడా హాల్–3కు సంబంధించినది చూపించారు. దాంతో ఏఆర్‌ఓ తన విధులకు ఆటంకం కలిగించడంతోపాటు బెదిరింపు చర్యలకు పాల్పడ్డారని పోలీసులకు ఫిర్యాదు చేయగా.. తిప్పర్తి పోలీసులు భూపాల్‌రెడ్డిపై కేసు నమోదు చేశారు.

## పాతాళంలో జలం.. నీళ్ల కోసం జాగారం

- అనుముల మండలం పేరూరు గ్రామంలో తాగునీటి తంటాలు



నీళ్ల కోసం పురాతన బావిలో స్థానికులు వేసిన మోటర్లు

హాలియా, జూన్ 6 : అనుముల మండలం పేరూరు గ్రామంలో తాగునీటి ఎద్దడి నెలకొన్నది. గత ఏడాది వర్షాభావ పరిస్థితుల వల్ల గ్రామ పైభాగంలోని సోమసముద్రం చెరువు, పక్కనే ప్రవహిస్తున్న అహల్య వాగు దశాబ్ద కాలం తర్వాత పూర్తిగా ఎండిపోయాయి. దాంతో గ్రామంలో తీవ్ర నీటి సమస్య ఏర్పడింది. 300 ఫీట్ల బోరు వేసినా నీళ్లు పడని పరిస్థితి. ఈ క్రమంలో గ్రామం మధ్యలో పురాతన కాలం నుంచి ఉన్న రెండు బావుల్లో చుట్టుపక్కల ఇండ్ల వాళ్లు మోటర్లు వేశారు. ఒకే బావికి డజన్‌కు పైగా మోటర్లు వేశారంటే గ్రామంలో నీటి ఎద్దడి ఎంత తీవ్రంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. అయితే.. వర్షాభావ పరిస్థితి, ఎండ తీవ్రత వల్ల వాటిల్లో భూగర్భ జలమట్టం పూర్తిగా అడుగంటి రోజుకు 5 నుంచి 10 బిందెల నీళ్లు మాత్రమే ఊరుతున్నాయి. ఆ నీళ్లను పట్టుకునేందుకు చుట్టుపక్కల వాళ్లు రాత్రివేళ జాగారం ఉంటున్నారు. అర్ధరాత్రి సమయంలో బావి దగ్గరికి వచ్చి మోటరు పెట్టుకొని నీళ్లు పట్టుకుంటున్నారు. ఒకవేళ ఎవరైనా ఆదమరిచి నిద్రపోతే అంతే సంగతి. మరునాడు ఇంట్లో నీళ్లు ఉండని పరిస్థితి. గ్రామస్తులు పక్కనే ఉన్న మదారిగూడెంలో ప్యూరిఫైడ్ వాటర్ ప్లాంట్ల వద్ద మంచినీళ్లు తెచ్చుకుంటున్నారు.



బావి వద్ద మోటార్ల కోసం వేసిన కరెంట్ తీగలు

అధికారులు స్పందించి నీటి సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# గెలుపు కోటా 1,55,095 ఓట్లు

**తొలి ప్రాధాన్యతలో తేలని విజేత**

- 18,565 ఓట్ల ఆధిక్యంలో తీన్మార్ మల్లన్న
- 1,04,248 ఓట్లతో రెండో స్థానంలో రాకేశ్‌రెడ్డి
- మొదలైన ద్వితీయ ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు
- నేడు వెలువడనున్న తుది ఫలితం
- కౌంటింగ్‌లో ఏకపక్ష ధోరణిపై ఈసీకి బీఆర్‌ఎస్ ఫిర్యాదు

నల్లగొండ ప్రతినిధి, జూన్ 6 (నమస్తే తెలంగాణ) : వరంగల్–ఖమ్మం–నల్లగొండ పట్టభద్రుల ఉప ఎన్నికల్లో ఊహించినట్లుగానే తొలి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపులో ఫలితం తేలలేదు. బరిలో ఉన్న ప్రధాన పార్టీల అభ్యర్థులు సైతం గెలుపు కోటాకు దూరంగా నిలిచిపోయారు. దాంతో విజేతను తేల్చేందుకు ఎలిమినేషన్ ప్రక్రియలో ద్వితీయ ప్రాధాన్యత ఓట్ల లెక్కింపునకు శ్రీకారం చుట్టారు. బుధవారం ఉదయం 8గంటలకు మొదలైన కౌంటింగ్‌లో తొలి రోజు సాయంత్రం వరకు కట్టలు కట్టే కార్యక్రమం కొనసాగింది. సాయంత్రం 4గంటల నుంచి మొదలైన తొలి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు రెండో రోజు సాయంత్రం 6గంటల వరకు కొనసాగింది. మొత్తం నాలుగు రౌండ్లల్లో తొలి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు కొనసాగగా ఒక్కో రౌండ్ కనీసం ఐదారు గంటల సమయం తీసుకుంది. ఇక ఎలిమినేషన్ రౌండ్ సైతం సుదీర్ఘంగా కొనసాగే అవకాశాలు కనిపిస్తున్నాయి. నేడు మధ్యాహ్నానికి తుది ఫలితం వెలువడి విజేత తేలనున్నట్లు అంచనా.



కౌంటింగ్ కేంద్రంలో ఓట్లు లెక్కిస్తున్న సిబ్బంది

### తొలి ప్రాధాన్యతలో తేలని ఫలితం

మొత్తం 3,36,013 ఓట్లు పోలవగా నాలుగు రౌండ్లల్లో తొలి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు చేపట్టారు. మొత్తం నాలుగు హాల్స్‌లో 96టేబుళ్లపై లెక్కింపు కొనసాగింది. కౌంటింగ్‌లో అందరి దృష్టి ప్రధాన అభ్యర్థులుగా భావించిన బీఆర్‌ఎస్ అభ్యర్థి రాకేశ్‌రెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న, బీజేపీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, స్వతంత్ర అభ్యర్థి పాలకూరి అశోక్‌కుమార్‌పైనే ఉంది. తొలి మూడు రౌండ్‌లలో తీన్మార్ మల్లన్నకు ఆధిక్యం లభించగా చివరి రౌండ్‌లో రాకేశ్‌రెడ్డి స్వల్ప ఆధిక్యతను ప్రదర్శించారు. నాలుగు రౌండ్లు ముగిసే సరికి తీన్మార్ మల్లన్నకు 1,22,813 ఓట్లు, రాకేశ్‌రెడ్డికి 1,04,248 ఓట్లు, ప్రేమేందర్‌రెడ్డికి 43,313 ఓట్లు, అశోక్‌కుమార్‌కు 29,697 ఓట్లు వచ్చాయి. ఇందులో మొత్తంగా తీన్మార్ మల్లన్న 18,565 ఓట్ల ఆధిక్యంలో ఉన్నారు. తొలి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు పూర్తయ్యాక చెల్లని ఓట్లను వేరు చేసి చెల్లిన ఓట్లను పరిగణలోకి తీసుకుని గెలుపు కోటాను ఫైనల్ చేశారు.

### గెలుపు కోటాకు దూరంగా...

మొత్తం పోలైన ఓట్లల్లో తొలి ప్రాధాన్యత లెక్కింపు పూర్తయ్యాక పరిశీలిస్తే 25,824ఓట్లు చెల్లనివిగా లెక్క తేలాయి. పట్టభద్రులై ఉండి కూడా నిబంధనల ప్రకారం ఓటు వేయడంలో వీరు విఫలం కావడం గమనార్హం. వీటిని తొలిగించిన అనంతరం చెల్లిన ఓట్ల సంఖ్య 3,10,189గా తేలింది. వీటిల్లోంచి 50శాతం ఓట్లు ప్లస్ ఒక్క ఓటును జత చేయగా గెలుపుకోటా 1,55,095 ఓట్లుగా నిర్ధారణ జరిగింది. ఈ ఓట్లను ఏ అభ్యర్థి అయితే సాధిస్తారో వారే విజేత కానున్నారు. ప్రస్తుతం అభ్యర్థుల వారీగా ఓట్లను పరిశీలిస్తే తీన్మార్ మల్లన్న గెలుపు కోటాను చేరుకోవాలంటే ద్వితీయ ప్రాధాన్యత ఓట్లల్లో 32,282 ఓట్లు సాధించాలి. రాకేశ్ రెడ్డి విజేతగా నిలువాలంటే 50,853 ఓట్లు ద్వితీయ ప్రాధాన్యతలో పొందాలి. ప్రస్తుతం ఎవ్వరూ కూడా గెలుపు కోటాకు చేరుకోలేకోవడంతో ఎలిమినేషన్ ప్రక్రియను ప్రారంభించారు.

### ఎలిమినేషన్ పద్ధతిలో విజేతగా..

అతి తక్కువ తొలి ప్రాధాన్యత ఓట్లు పొందిన అభ్యర్థి నుంచి పైకి ఎలిమినేషన్ ప్రక్రియ కొనసాగుతుంది. మొత్తం 52 మంది అభ్యర్థులు బరిలో నిలువగా ఇందులో 10 ఓట్లు మాత్రమే సాధించి చివరలో నిలిచిన యాతాకుల శేఖర్ నుంచి ఎలిమినేషన్ మొదలైంది. శేఖర్‌కు పోలైన ద్వితీయ ప్రాధాన్యత ఓట్లను ఇతర అభ్యర్థులకు పంచివేస్తూ వస్తారు. ఇలా కిందనుంచి పైకి ఒక్కొక్క అభ్యర్థిని ఎలిమినేట్ చేస్తూ పోటీలో ఉన్న ఇతర అభ్యర్థులకు ద్వితీయ ప్రాధాన్యత ఓట్లను వేస్తూ వస్తారు. ఈ క్రమంలో ఏ అభ్యర్థికైనా గెలుపు కోటా ఓట్లు వస్తే అక్కడ కౌంటింగ్ నిలిపివేస్తారు. ప్రస్తుత పరిస్థితిని చూస్తుంటే చివరి వరకు తీన్మార్ మల్లన్నతోపాటు రాకేశ్‌రెడ్డి పోటీలో నిలువనున్నారు. అప్పటికీ కోటా తేలకపోతే రెండో స్థానంలో నిలిచిన అభ్యర్థి ద్వితీయ ప్రాధాన్యత ఓట్లను కూడా మొదటి అభ్యర్థికి పంచివేస్తూ విజేతను ప్రకటిస్తారు. ఈ ప్రక్రియ అంతా ముగిసి విజేత తేలాలంటే శుక్రవారం మధ్యాహ్నం వరకు సమయం తీసుకోవచ్చని అంచనా.

### ఎవరికి ఎన్ని ఓట్లు

| అభ్యర్థి పేరు | మొదటి ప్రాధాన్యత ఓట్లు |
|---|---|
| తీన్మార్ మల్లన్న | 1,22,813 |
| ఏనుగుల రాకేశ్‌రెడ్డి | 1,04,248 |
| గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి | 43,313 |
| అశోక్ కుమార్ పాలకూరి | 29697 |
| బక్క జడ్సన్ | 2,057 |
| బరిగెల దుర్గాప్రసాద్ ముహారాజ్ | 1,947 |
| సోదె వెంకటేశ్వర్లు | 812 |
| గుండాల జ్యోతి | 547 |
| పూజారి సత్యనారాయణ | 538 |
| పెట్టెం మల్లికార్జున్ | 457 |
| కర్నె రవి | 268 |
| మందర మల్లికార్జున్‌రావు | 241 |
| పెడిశెట్టి రాజు | 228 |
| ఐతగోని రాఘవేంద్ర | 213 |
| ఈద శేషగిరిరావు గౌడ్ | 197 |
| తాడిశెట్టి క్రాంతికుమార్ | 184 |
| దునుకు వేలాద్రి | 181 |
| అంబాల రాజేశ్ | 154 |
| చంద్ర క్రాంతికుమార్ | 144 |
| కంటె సత్యన్న | 132 |
| కోడిరెక్క ఉమాశంకర్ | 124 |
| పూస శ్రీనివాస్ | 110 |
| రాజు నాయక్ గుగులోతు | 108 |
| జానయ్య నందిపాటి | 107 |
| ఏఎస్ కృష్ణ | 103 |
| చెన్న శ్రీకాంత్ | 100 |
| అనిల్ కుమార్ గాదెపాక | 87 |
| పాటి శ్రీకాంత్‌రెడ్డి | 84 |
| గుగులోతు భీమా | 82 |
| మాదవపెద్ది వెంకట్‌రెడ్డి | 78 |

మిగిలిన 21 మంది అభ్యర్థులందరికీ కలిపి మొత్తం 782 ఓట్లు వచ్చాయి

### గెలుపుపై ధీమాలో కాంగ్రెస్, బీఆర్‌ఎస్

ఎలిమినేషన్ పద్ధతిలో ద్వితీయ ప్రాధాన్యత ఓట్లతో గెలుపుపై అటు తీన్మార్ మల్లన్న, ఇటు రాకేశ్‌రెడ్డి ధీమాతో ఉన్నారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి రాకేశ్‌రెడ్డి తనకే ఎక్కువ ద్వితీయ ప్రాధాన్యత ఓట్లు పోలవుతాయని భావిస్తున్నారు. అటు స్వతంత్ర అభ్యర్థి అశోక్‌తోపాటు బీజేపీ అభ్యర్థి ప్రేమేందర్‌రెడ్డిలకు పోలైన ద్వితీయ ప్రాధాన్యత ఓట్లే విజేతను తేల్చడంలో కీలకంగా మారనున్నాయి. వీరికి పోలైన ద్వితీయ ప్రాధాన్యత ఓట్లు ఎటువైపు ఉంటే వారే విజేతగా నిలువనున్నారు.



కౌంటింగ్‌లో అభ్యంతరాలపై విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ అభ్యర్థి రాకేశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి

## కౌంటింగ్ కేంద్రంలో బీఆర్‌ఎస్ ఆందోళన

కౌంటింగ్ కేంద్రంలో ఆర్‌ఓతోపాటు అధికారులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని బీఆర్‌ఎస్ అభ్యర్థి రాకేశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి గురువారం సాయంత్రం మీడియా ముందుకు వచ్చారు. ఓట్ల లెక్కింపులో తమ అభ్యంతరాలను, అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోకుండానే ఫలితాలు ప్రకటించడాన్ని వారు తీవ్రంగా ఖండించారు. పలు టేబుళ్లపై ఓట్ల లెక్కింపుతోపాటు మూడో రౌండ్‌లో తమకు సంబంధం లేకుండానే ఫలితాన్ని ప్రకటించారని మండిపడ్డారు. ప్రజాస్వామ్యబద్ధంగా, పారదర్శకంగా కౌంటింగ్ కొనసాగాలే చూడాలని డిమాండ్ చేశారు. కౌంటింగ్‌లో తమ అభ్యంతరాలను వ్యక్తపరుస్తూ ఎన్నికల కమిషన్‌తోపాటు అబ్జర్వర్ రాహుల్ బొజ్జకు, రిటర్నింగ్ అధికారి హరిచందనకు బీఆర్‌ఎస్ అభ్యర్థి రాకేశ్‌రెడ్డి లేఖను అందజేశారు.

# పారిశుధ్యం అస్తవ్యస్తం

- ఆరు నెలలుగా గ్రామ పంచాయతీ కార్మికులకు వేతనాల్లేవు
- మరమ్మతులకు నోచని గ్రామ పంచాయతీ ట్రాక్టర్లు
- రిపేరు చేసేందుకు డబ్బుల్లేవంటున్న కార్యదర్శులు
- పొంగుతున్న డ్రైనేజీలు, కాలిపోయిన వీధి దీపాలు
- గాడి తప్పిన పంచాయతీ పాలన

నల్లగొండ, జూన్ 6 : జిల్లాలో గ్రామ పంచాయతీల పరిస్థితి దారుణంగా మారింది. పంచాయతీల్లో పాలక వర్గ పదవీకాలం పూర్తవడం.. ప్రతినెలా ప్రభుత్వం నుంచి వచ్చే నిధులు ఆగిపోవడం, పారిశుధ్య కార్మికులకు వేతనాలు లేకపోవడంతో పల్లెల్లో పాలన గాడి తప్పింది. వేసవి కాలంలో నీటి కోసం గోస పడ్డ జనం వానకాలం ప్రారంభం కాగానే పారిశుధ్య సమస్యతో ఇబ్బంది పడుతున్నారు. నిన్న మొన్న పడిన వర్షాలు, గాలి దుమారానికి డ్రైనేజీలు పొంగుతుండగా.. విద్యుత్ స్తంభాలు కూలిపోవడంతో వీధి దీపాలు కాలి పోయాయి. వాటిని బాగు చేసే వారు లేక పోవడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు.

### వర్షాలతో పొంగుతున్న డ్రైనేజీలు

ఈ సారి వర్షాకాలం ప్రారంభం కంటే ముందుగానే అల్పపీడనం ప్రభావంతో వర్షాలు పడ్డాయి. ప్రస్తుతం నైరుతి రుతుపవనాల రాకతో వానలు కురుస్తున్నాయి. జిల్లాలో రెండు రోజులు కురిసిన వర్షాలతో డ్రైనేజీలు పొంగి పొర్లుతున్నాయి. వీధుల్లో, మురుగు కాల్వల్లో చెత్త పేరుకు పోయినా వాటిని శుభ్రం చేసే పరిస్థితి లేకుండా పోయింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆరు నెలలుగా పంచాయతీ పారిశుధ్య కార్మికులకు వేతనాలు ఇవ్వకపోవటంతో వారు పారిశుధ్యంపై దృష్టి పెట్టడం లేదు. పైగా ట్రాక్టర్లు చెడిపోయినా రిపేరు చేయక పోవడంతో చెత్త సేకరణ జరుగడం లేదు.

### వేధిస్తున్న నిధుల కొరత

గ్రామ పంచాయతీల్లో నిధుల లేమి కారణంగా కార్మికులకు ఆరు నెలలుగా వేతనాలు ఆగిపోయాయి. దీనికి తోడు ట్రాక్టర్లు చెడిపోయి మరమ్మతులు చేసే పరిస్థితి లేకపోవడంతో అవి గ్రామ పంచాయతీలకే పరిమితమయ్యాయి. గ్రామాల్లో ఈదురు గాలులతో కూడిన వర్షాలకు వీధి లైట్లు కాలిపోయాయి. పంచాయతీ పాలక వర్గం లేనందున వాటి రిపేరు విషయమై పట్టించుకునే వారు లేకుండా పోయారు. ప్రభుత్వం నుంచి నిధులు రానందున కార్యదర్శులు సైతం చేతులెత్తేశారు. ఫలితంగా ప్రజలు చీకట్లోనే కాలం వెల్లదీస్తున్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం జిల్లాకు ప్రతి నెలా రూ.20 కోట్లు ఇవ్వగా ప్రస్తుత ప్రభుత్వం డిసెంబర్, జనవరిలో రూ.9.68 కోట్లు మాత్రమే ఇచ్చింది. అవి కూడా ఫిబ్రవరిలో పాలన పూర్తయిన సర్పంచులు ఉన్నకాడికి ఊడ్చుకొని పోయారు. దాంతో పంచాయతీల గల్లా ఖాళీ కాగా పాలన పడకేసింది.



తిప్పర్తి మండలం తానేదారుపల్లి పరిధిలోని అల్లిగూడెంలో డ్రైనేజీని శుభ్రం చేసుకుంటున్న గ్రామస్తులు(ఫైల్)

### ఆరు నెలలుగా కార్మికులకు వేతనాల్లేవ్

జిల్లాలో 844 గ్రామ పంచాయతీలు ఉండగా 3,258 మంది పారిశుధ్య కార్మికులు పని చేస్తున్నారు. గతంలో ప్రతి గ్రామ పంచాయతీకి ఒక్కడే కార్మికుడు ఉండగా.. వారికి నెలకు రూ.1500 వేతనం ఇచ్చేవారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత కార్మికుల సంఖ్యను పెంచడంతో పాటు వారి వేతనాన్ని సైతం ప్రతినెలా రూ.9,500 అందజేసింది. దాంతో కార్మికులు చెత్త ఎప్పటికప్పుడు ఎత్తి డంపింగ్ యార్డుల్లో పోసేవారు. ప్రస్తుతం కార్మికులకు ఆరు నెలలుగా వేతనాలు ఇవ్వక పోవడం, ట్రాక్టర్లు నడువడానికి డీజిల్ సైతం లేనందున ఎక్కడి చెత్త అక్కడే ఉంది. నిన్న మొన్న కురిసిన వర్షాలకు డ్రైనేజీలు పొంగుతుంటే ప్రభుత్వం పట్టించుకోక పోవడంతో కొన్ని గ్రామాల్లో ప్రజలే స్వచ్ఛందంగా శుభ్రం చేసుకుంటున్నారు.

### ఆరు నెలలుగా జీతాలివ్వకుంటే బతికేదెట్లా

గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు మాకు నెల నెలా జీతం ఇచ్చింది. ట్రాక్టర్ల నిర్వహణకు డబ్బులు చెల్లించింది. దాంతో ప్రతి రోజూ ఉదయం ఏడు గంటలకే ఊర్లకు పోయి చెత్త ఎత్తి డంపింగ్ యార్డులో పోసేది. ఇప్పుడు ఆరు నెలలుగా జీతాల్లేవ్. మా ఊరి ట్రాక్టర్ ఖరాబ్ అయింది. బాగు చేయించమంటే కార్యదర్శి డబ్బుల్లేవని అంటున్నాడు. మేమేం చేయం. కనీసం ట్రాక్టర్ రిపేర్ చేపిస్తే చెత్త తీయడానికి వీలుంటది. గవర్నమెంట్ ఆలోచించి డబ్బులిస్తే బాగుండు.

**-నల్లగొండ మండలానికి చెందిన ఓ పారిశుధ్య కార్మికుడు**



చిట్యాల మండలం గుండ్రాంపల్లిలో బడిబాట కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎ.నర్సిరెడ్డి

# బడిబాట షురూ..

- తొలి రోజు అన్ని పాఠశాలల్లో అమ్మ ఆదర్శ కమిటీ సమావేశాలు

రామగిరి, జూన్ 6 : ప్రభుత్వ పాఠశాలల ప్రత్యేకత, బడిలో విద్యార్థుల నమోదు తదితర అంశాలపై విద్యాశాఖ ఈ నెల 19వరకు నిర్వహించే బడిబాట కార్యక్రమం గురువారం ప్రారంభమైంది. జిల్లా వ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో ఈ కార్యక్రమం చేపట్టారు. తొలి రోజు ఆయా పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్, సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహించారు. పాఠశాలల్లో విద్యార్థుల నమోదు, బడీడు పిల్లలను బడిలో చేర్పించుట, సర్కారు బడిలో ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను ప్రజలకు వివరించేలా ప్రణాళికలు చేశారు. అదే విధంగా ఆయా పాఠశాలల పరిధిలో బడిబాట ర్యాలీలు నిర్వహించారు. చిట్యాల మండలం గుండ్రాంపల్లిలో నిర్వహించిన బడిబాటలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అల్లుబెల్లి నర్సిరెడ్డి పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమాల్లో అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సీఆర్పీలు, అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల చైర్మన్లు, సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ముగిసిన టీఎస్ ఐసెట్

రామగిరి, జూన్ 6 : ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే టీఎస్ ఐసెట్ ప్రవేశ పరీక్ష గురువారం ముగిసింది. నల్లగొండలోని ఎస్పీఆర్ పాఠశాల ఆవరణలోని డీపీఎంఎస్ పరీక్ష కేంద్రంలో ఆన్‌లైన్‌లో జరిగిన పరీక్షకు రెండో రోజు 185మంది విద్యార్థులకుగాను 173మంది హాజరయ్యారు. 12 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ నీలంరెడ్డి వెల్లడించారు.